క్లుప్తంగా

పరామర్శ



ములుగు రూరల్ : గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన లావుడియా రాజమ్మ, సన్న గుండ్ల వెంకటేశ్వర్లు, దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన అజ్మీరా కన్న, పున్నం రజితలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ములుగు ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. ఆదివారం బాధిత కుటుంబాలను కలిసి ఓదార్చారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బానోత్ రవిచందర్, పాలడుగు వెంకటక్రిష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్‌రావు తదితరులు ఉన్నారు.

కరకట్టకు మరమ్మతులు



ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం సమీపంలోని కరకట్ట వద్ద వరద నీరుకు మట్టి ఒర్రిపోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇరిగేషన్ అధికారులు 200 ఇసుక బస్తాలను కరకట్టకు వేశారు. బండరాయితో రివిట్‌మెంట్ చేసిన వద్ద, మరో చోటలో ఇసుక బస్తాలను వేసి వరదకు కరకట్ట కోతకు గురికాకుండా చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరువచ్చే అవకాశం ఉందని సమాచారం రావడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు.

నేడు 'మన ఊరు -మన రమణన్న'

శాయంపేట : నేడు (సోమవారం) మండలంలోని పత్తిపాక గ్రామంలో 'మన ఊరు-మన రమణన్న' పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరౌతారని వారు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు గండ్ర దంపతులు పత్తిపాకకు చేరుకొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి సమస్యల గురించి అడిగి తెలుసుకుంటారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మొక్కలను నాటి సంరక్షించండి



శాయంపేట : సమాజంలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సీఎస్ఐ చర్చి పాస్టర్ డి.అనిల్‌కుమార్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఆ చర్చి ఆవరణలో 'సండే ప్లాంటేషన్' పేరుతో ఆయన ఆధ్వర్యంలో క్రైస్తవులు, దైవజనులు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాస్టర్ అనిల్‌కుమార్ మాట్లాడారు. మానవ మనుగడకు బాటలు వేసే దిశగా సండే ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పేదలకు సేవలు అందించడం, శాంతియుత సమాజ నిర్మాణంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం సైతం క్రైస్తవులు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ కార్యదర్శి బొచ్చు పాల్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆడుకునేది ఎలా?

- పేరుకే క్రీడాప్రాంగణాలు
- క్రీడాకారులకు ఉపయోగపడని ఆట మైదానాలు



ఏలేటిరామయ్యపల్లిలో చెరువు కట్టపైన ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

చిట్యాల: గ్రామీణ క్రీడాకారుల క్రీడానైపుణ్యాన్ని వెలికితీయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ జిల్లా అధికారుల అలసత్వం మూలంగా మండలంలోని క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులకు ఉపయగపడకుండా ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా మైదానాలను సరైనా స్థలంలో ఏర్పాటు చేసిన దాఖాలలు లేవని వాపోతున్నారు. మరికొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా, స్థల వివాదాలతో ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారుల ఒత్తిడితో మండల అధికారులు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో క్రీడాప్రాంగణాలకు స్థలం లేక పోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొని గుంట స్థలంలో కూడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఏలేటిరామయ్యపల్లి గ్రామంలో స్థలం లేకపోవడంతో గ్రామ శివారులోని చెరువుకట్టపై నేమ్‌బోర్డు పెట్టారు. చెరువుకట్టపైనే ఆటలు ఆడుకోవాలా అనే ప్రశ్న క్రీడాకారుల్లో తలెత్తుతోంది. అలాగే కొత్తపేటలో గుంట భూమిలో గతంలో క్రీడాప్రాంగణం బోర్డు పెట్టారు. కానీ ఇప్పుడు అదే స్థలంలో గ్రామ పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణం చేపడుతున్నారు. క్రీడాకారులు ఎక్కడ ఆటలు ఆడుకోవాలో.. ఎక్కడ నేర్చుకోవాలో జిల్లా అధికారులే తెలుపాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఇప్పటికైనా మండలంలోని క్రీడా ప్రాంగణాలను పని చేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న శ్రీకాంత్

టేకుమట్ల: స్వచ్ఛమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జనసేన జిల్లా నాయకుడు ఆకుల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటి, ట్రీగార్డులను ఏర్పాటు మొక్కలకు జనసేనాగా నామకరణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు నాటిన మొక్క భవిష్యత్‌లో వృక్షంగా మారి ఎంతో మందికి నీడనివ్వడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని అన్నారు. ఆయన వెంట నాయకులు ఎండీ సలీం, నిమ్మల ప్రవీన్, కొయ్యడ సురేందర్, మధుకర్, వినయ్, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మధుసూదనాచారికే టికెట్ ఇవ్వాలి

శాయంపేట : రానున్న ఎన్నికల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారికే భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు పల్లెబోయిన సారయ్య అధిష్టానాన్ని, పార్టీ జిల్లా అధ్యక్షుడిని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సారయ్య మాట్లాడారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మధుసూదనాచారి భూపాలపల్లి నుంచి గెలిచి రాష్ట్ర తొలి శాసన సభాపతిగా నియమితులై ప్రజలకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. భూపాలపల్లిని అనతికాలంలోనే అత్యద్భుతంగా అభివృద్ధి చేసిన ఘనత మధుసూదనాచారి సొంతమన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ మధుసూదనాచారికే బీఆర్ఎస్ టికెట్ రావాలని ఆశిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా మధుసూదనాచారి కచ్చితంగా గెలుస్తారని స్పష్టం చేశారు. ప్రజాకాంక్ష, స్థానిక పరిస్థితుల నేపథ్యంలో పార్టీ అధిష్టానం స్పందించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి టికెట్ ఇస్తే ఓటమి ఖాయమన్నారు.

గ్రామాల్లో దోమల మందు పిచికారీ



ఫాగింగ్ చేస్తున్న జీపీ సిబ్బంది



మల్యాలలో పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: మండలంలోని మారుమూల గ్రామాలు, గొత్తికోయగూడేల్లో దోమల మందు పిచికారీని జీపీ అధికారులు, వైద్య సిబ్బంది సంయుక్తంగా చేపట్టారు. మలేరియా జ్వరాలు విస్తరిస్తుండడంతో దోమల మందుతో పాటు ఫాగింగ్ కూడా సాయంత్రం వేళలో చేస్తున్నారు. దోమలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, దోమలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్లలోకి వెళ్లే అవకాశం ఉండడంతో వాటిని నివారించేందుకు ఫాగింగ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా వరద ముంపు ప్రాంతాల్లో కూడా బ్లీచింగ్ చేయించడంతో పాటు దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల రాయబంధంలో ఓ ఎనిమిది సంవత్సరాల చిన్నారి అమృత మృతి చెందడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. దోమల నివారణపై చర్యలు చేపట్టేందుకు విరివిరిగా పిచికారీ చేపట్టారు.

జగదీష్ సేవలు మరువలేనివి



ములుగు: జగదీష్ జయంతి వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, నాయకులు



ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : దివంగత మాజీ జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ సేవలు, జ్ఞాపకాలు మరువలేనివని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీం, ఎంపీపీ అంతటి విజయ అన్నారు. ఆదివారం జగదీష్ జయంతి వేడుకలను స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ దేవాదులకు చెందిన రాంబాబు గీతాలను ఆలపించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి జగదీష్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నూతి కృష్ణ, కూనూరు మహేష్, తుమ్మ మల్లారెడ్డి, కాళ్ల రామకృష్ణ, సలీం, సర్దార్‌పాషా, కొండాయి చిన్ని, రాంబాబు, రమణ, చంద్రబాబు, బోజారావు, కావిరి చిన్ని కృష్ణ, చిప్ప అశోక్, లొటపెటల రాజేష్, కిరణ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): కుసుమ జగదీష్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. జగదీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతో పాటు జిల్లాను అభివృద్ధి పథకంలో తీసుకెళ్లిన నేత జగదీష్ అన్నారు.

ములుగు: : దివంగత జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ 47వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఎస్ఎస్‌తాడ్వాయిలో..

ఎస్ఎస్ తాడ్వాయి : దివంగత జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ సేవలు మరువలేనివని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అయన జయంతి వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏటూరునాగారం డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం, తాడ్వాయి ఉపసర్పంచ్ ఇంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, మహిళా మండల అధ్యక్షురాలు నాగమ్మ, యూత్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సలేందర్, మండల ఉపాధ్యక్షుడు రజనీకర్, నాయకులు శేషగిరి, సంజీవరెడ్డి, మహిపాల్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె)లో..



ఎస్ఎస్ తాడ్వాయి: కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



గణపురం: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాటారం: విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు



చిట్యాల: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కాటారం: భారత దేశ అభ్యున్నతికి దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయం అని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని తిమోతి అనాథ బాలుర ఆశ్రమ పాఠశాలలో భారత మాజీ ప్రధాని జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేద విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దేశంలో ఐటీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ ప్రధాన కార్యదర్శి కడారి విక్రమ్, నాయకులు కొట్టె శ్రీహరి, అశోక్, చీమల వెంకటస్వామి, రమేశ్‌రెడ్డి, రాజబాబు, శివ, దాదామియా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గణపురం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు మండలంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రేపాక రాజేందర్, మండల నాయకులు కట్కూరి శ్రీనివాస్, ఆర్మూళ్ల ఎల్లస్వామి, ఎండీ పాషా, మామిండ్ల మల్లికార్జున్, మునిగాల రమేష్, ఓరుగంటి కృష్ణ, గంధం ఉధాకర్, దూడపాక పున్నం తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ రాజనీతిజ్ఞుడు ఆధునీకరణకు బీజం వేసిన గొప్ప మహానియుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, మండల నాయకులు గుమ్మడి సత్యనారాయణ, దొడ్డి కిష్టయ్య, రాయకొమురు, సమ్మయ్య, సదానందం, రమేష్, రాజమౌళి, సంతోష్, రాజన్న, కొత్తపేట సర్పంచ్ రవి పాల్గొన్నారు.

మైక్‌సెట్ అందజేత



మైక్ సెట్ అందజేస్తున్న దాతలు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ, ముచినిపర్తి గ్రామాల మధ్యగల శివారులో గౌడ కులస్తులు నిర్మించిన ఎల్లమ్మతల్లి ఆలయానికి ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం మైక్ సెట్ అందజేశారు. గౌడ కులస్తుల ఆరాధ్యదైవం శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి దావు వెంకటమ్మ-మల్లారెడ్డి జ్ఞాపకార్థం మైక్‌సెట్ అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

మల్హర్: పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ గిరి హరీష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదెకరాల లోపు భూమి, ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిన వారు ఇందుకు అర్హులని చెప్పారు. ఉపాధిహామీ పథకం కింద 2023–24 సంవత్సరానికి రైతులు దరఖాస్తు పత్రంతో పాటు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, గ్రామ పంచాయతీ తీర్మానం కాపీతో కలిపి గ్రామ పంచాయతీ కార్యదర్శి, లేదా ఏఈఓ(వ్యవసాయ విస్తరణ)అధికారి లేదా ఏపీఓకు సమర్పించాలని వెల్లడించారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, జామ, సపోట, సీతాఫలం, మునగ, కొబ్బరి(గట్లవెంబడి మా త్రమే), డ్రాగన్‌ఫ్రూట్(20 గుంటలకు మాత్రమే), బ త్తాయి, అయిల్‌పామ్, అల్లనేరేడు మొక్కలను అందించడం జరుగుతుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీ, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. తోటలు పెంచుకోవటానికి, గుంతలు తీయుటకి, మొక్కలు నాటడానికి, మొక్కకు ఊత కర్ర కట్టడానికి, మొక్కల కొనుగోలుకు, నెలనెలా పర్యవేక్షణ చేయడానికి 3 సంవత్సరాల వరకు డబ్బులు ఉపాధి పథకం నుంచి ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆర్ఎంపీల మండల కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని వెల్లడించారు. భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, ఉపాధ్యక్షులుగా చెలికాని రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. సమావేశానికి అసోసియేషన్ నాయకులు కాసం అశోక్‌రెడ్డి, వంగ కుమారస్వామి, దుబాసి బాలరాజు, లక్ష్మీనారాయణ, రాజు, చేపూరి రాజేందర్, దూలం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?



నర్సింగాపూర్ మీనాజీపేట మధ్య కోతకు గురైన రోడ్డు

మహాముత్తారం: ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని మీనాజీపేట నుంచి నర్సింగాపూర్ వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో భారీగా కోతకు గురయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుగుండా వాహనదారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాజేడు: కారు తనిఖీ చేస్తున్న పోలీసులు



మహాముత్తారంలో..



వెంకటాపురం(కె)లో..



ఏటూరునాగారంలో..

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. 163 నంబర్ జాతీయ రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదా చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అనుమానితులు, కొత్తవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర గ్రామ సమీపంలో ఆదివారం ఎస్సై రేక అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనంలోని ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఏటూరునాగారం: మండలంలోని జీడివాగు ప్రధాన రోడ్డుపై పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఏఎస్సై సుబ్బారావు సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బందితో కలిసి భూర్గంపాడ్-ఏటూరునాగారం ప్రధాన రోడ్డుపై వచ్చిపోయే వాహనాలను నిలిపి వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇతర పత్రాలను తనిఖీ చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో ముందస్తుగా తనిఖీలు చేపట్టారు.

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి, నిమ్మగూడెం, డొబ్బలపాడు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో ఆదివారం ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనాలు ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన ఊర కుమారస్వామి అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఆదివారం 25కిలోల బియ్యాన్ని అందించారు. ఆయన వెంట కానిస్టేబుల్ సుమన్ ఉన్నాడు.